సీనియర్ జర్నలిస్టు శాంతారామ్ మృతి

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 26: సీనియర్ జర్నలిస్టు బి. శాంతారామ్ అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గత మూడు రోజులుగా కూకట్‌పల్లిలోని సిగ్నస్ వైద్యశాలలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచాడు. శాంతారామ్ ఈనాడు, సుప్రభాతం, ప్రజాతంత్ర వంటి దినపత్రికలు, ఇండియా ఇన్ఫో డాట్ కం లాంటి వెబ్ సైట్ లో జర్నలిస్టుగా పనిచేశారు. శాంతారామ్ భార్య ఇందిరా హోం శాఖలో డిప్యూటీ సెక్రటరీగా పనిచేస్తున్నారు. వీరికి ఒక కూతురు ఉంది. ఈ రోజు అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

స్విమ్మింగ్‌పూల్‌కు రెండో నోటీసు అందజేత

దుండిగల్ , మార్చి 26: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్30 వ డివిజన్, సిరి వ్యాలీ గేటెడ్ కమ్యూనిటీ గేటుపక్కన ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న కమర్షియల్ స్విమ్మింగ్‌పూల్ పై చర్యలకు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఉపక్రమించారు. ఇప్పటికే ఒక నోటీసు అందజేసిన అధికారులు మరోసారి రెండో నోటీసు అందజేయాలని నిర్ణయించారు. విషయాన్ని కార్పొరేషన్ కమిషనర్ సాబేర్ అలీ వెల్లడించారు.

ఢిల్లీకి మెట్రో బృందం

రెండో దశ మెట్రో డీపీఆర్‌పై కేంద్రంతో భేటీ

టెక్నికల్, ఫైనాన్షియల్ అంశాలపై స్పష్టత ఇచ్చిన హెచ్‌ఏఎంఆర్

సిటీబ్యూరో, మార్చి 26 (నమస్తే తెలంగాణ) మెట్రో ఫేజ్-2 విస్తరణపై హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో లిమిటెడ్(హెచ్‌ఏఎంఎల్) కేంద్ర ప్రతినిధుల బృందంతో సమావేశమైంది. బుధవారం కేంద్ర పట్టాభివృద్ధి శాఖ అధికారుల బృందంతో జరిగిన భేటీలో హైదరాబాద్ మెట్రో ఫేజ్-2పై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో మెట్రో విస్తరణకు హెచ్‌ఏఎంఆర్ రూపొందించిన డీపీఆర్‌లోని పలు టెక్నికల్ అంశాలపై వివరణ ఇచ్చినట్లుగా తెలిసింది. కాగా కేంద్రం ఈ డీపీఆర్‌కు ఆమోదం తెలపాల్సి ఉంది. అయితే ప్రాజెక్టులోని నిర్మాణపరమైన అంశాలపై సవివరంగా కేంద్ర ప్రభుత్వంతో చర్చించినట్లుగా తెలిసింది. కాగా ఇప్పటికే రెండు దఫాలుగా కేంద్ర ప్రభుత్వంతో డీపీఆర్ విషయంపై మెట్రో అధికారులు చర్చించగా, తాజాగా ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి సారథ్యంలో బుధవారం భేటీ కాగా, ఫైనాన్షియల్ అంశాలపై కూడా చర్చించినట్లుగా తెలిసింది. ప్రాథమిక అనుమతులిచ్చేలా చొరవ తీసుకునే పలు అంశాలపై మెట్రో అధికారులు కేంద్రానికి స్పష్టతనిచ్చారు. ప్రస్తుతం భూసేకరణ దశలో ఉన్న 7.5 కిలోమీటర్ల ఓల్డ్ సిటీ మెట్రోకి కూడా ఇదే డీపీఆర్‌లో ఉండగా కేంద్ర ప్రభుత్వం ఆమోదిస్తే నిర్మాణ పనులు వేగంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టనున్నారు. 116 కిలోమీటర్ల మేర నూతనంగా నిర్మించే మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వంతో మెట్రో అధికారులు సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో డీపీఆర్‌ను కేంద్రానికి చేరవేయగా ప్రస్తుత పరిశీలన దశలో ఉంది. ఈ క్రమంలో హెచ్‌ఏఎంఎల్ ఫేజ్-2లోని ఐదు కారిడార్లపై చర్చించారు. దాదాపు రూ. 24వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనుండగా ఇందులో కేంద్ర వాటాగా రూ. 4230 కోట్లు చెల్లించాల్సి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం రూ.7313 కోట్లు ఇవ్వాల్సి ఉంది. మిగిలిన మొత్తాన్ని ఆర్థిక సంస్థల నుంచి రుణాల రూపంలో తీసుకునేలా ఆర్థిక ప్రణాళికలు ఉండగా కేంద్ర ఆమోదంతో నిర్మాణ పనులు వేగవంతం కానున్నాయి.

శామీర్‌పేట్ మెట్రో డీపీఆర్

ఫేజ్-2లోనే రెండో భాగంగానే జేబీఎస్ నుంచి శామీర్‌పేట్, మేడ్చల్ మార్గంలో నిర్మించేందుకు అవసరమైన డీపీఆర్ రూపకల్పన జరుగుతుంది. ప్రస్తుతం మరో నెల రోజుల వ్యవధిలోనే డీపీఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయనున్నట్లుగా తెలిసింది. ఈ క్రమంలో రెండో భాగానికి మే నెలలో కేంద్రానికి పంపించే అవకాశం ఉంది.

మేయర్‌ను కలిసిన ఇండియనా ప్రతినిధుల బృందం

సిటీబ్యూరో, మార్చి 26 (నమస్తే తెలంగాణ) జీహెచ్‌ఎంసీతో అమెరికా దేశానికి చెందిన ఇండియానా స్టేట్‌తో 2010 సిస్టర్ సిటీ ఒప్పందం చేసుకున్నది. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి చెందిన ప్రతినిధి బృందం హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా బుధవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ ఆ బృందాన్ని సాదరంగా ఆహ్వానించి ధన్యవాదాలు తెలిపారు. సిస్టర్ సిటీ ఒప్పందంలో భాగంగా పలు కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, ఇండియానా ప్రతినిధులు మేయర్‌కు వివరించారు. ఇండియానా పోలీస్ సెక్రటరీ ఆఫ్ స్టేట్ డియాగో మోరల్స్, చింతాల రాజు, చీఫ్ అడ్వైజర్ ఆఫ్ గ్రోత్ అండ్ స్ట్రాటజీ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు ఆదరణ కరువు

చిక్కడపల్లి, మార్చి 26 : రాష్ట్రంలో కళాకారులకు ఆదరణ లేదని, ప్రభుత్వం కళాకారుల పట్ల బడ్జెట్లో తీవ్ర వివక్షత చూపిందని టీపీ ఎస్ కే రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి కట్ట నర్సింహ అన్నారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం తెలంగాణ ప్రజా సంస్కృతి కేంద్రం, ప్రజానాట్య మండలి సంయుక్తంగా అధ్వర్యంలో ''తెలంగాణ కళాకారులకు సంక్షేమం లేని సాంస్కృతిక రంగం-బడ్జెట్'' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ కళాకారులకు ఒక్క పైసా సంక్షేమ పథకానికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం 2025 - 26 బడ్జెట్ లో 74 కోట్ల బడ్జెట్ కేటాయింపులు కేవలం అంకెలు, సంఖ్యలు పెద్ద మాయ విమర్శించారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షుడు రాకేష్ రావణ్, తెలంగాణ ప్రజా నాట్య మండలి శ్రీనివాస్, సాంబరాజు యాదగిరి, పి కళ్యాణ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు వి ఆనంద్ ,ఆశన్న నరేష్ ,పి రాజయ్య ,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో ఉన్నత విద్యకు మంచి అవకాశాలు

సౌత్ ఆస్ట్రేలియా మంత్రి పీటర్ మాలినౌస్కాస్

సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పీటర్ మానినౌస్కాస్

బంజారాహిల్స్,మార్చి 26: విదేశాల్లో ఉన్నత విద్యను చదువుకోవాలనే విద్యార్థులకు సౌత్ ఆస్ట్రేలియాలో మంచి అవకాశాలున్నాయని, భారత్‌కు చెందిన విద్యార్థులు వాటిని అందిపుచ్చుకోవాలని సౌత్ ఆస్ట్రేలియా మంత్రి (ప్రీమియర్) పీటర్ మాలినౌస్కాస్ అన్నారు. ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న పీటర్ మాలినౌస్కాస్ హైదరాబాద్‌కు వచ్చారు. బుధవారం బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో 'స్టడీ ఆడిలైడ్' పేరుతో నిర్వహించిన సదస్సులో పీటర్ మాలినౌస్కాస్ మాట్లాడుతూ బలమైన ఆర్థికశక్తిగా ఎదిగిన సౌత్ ఆస్ట్రేలియాలో హెల్త్, రిన్యువబుల్ ఎనర్జీ, అంతరిక్ష పరిశోధన, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తదితర రంగాలు పుంజుకుంటున్నాయన్నారు. ఆస్ట్రేలియాలో విద్యను అందుకోవడంతో పాటు అక్కడ ఉపాధి అవకాశాలు పొందాలనుకుంటున్న భారత విద్యార్థులకు ప్రస్తుతం మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. హైదరాబాద్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ డీన్ ప్రొ. జీవీఆర్‌కే.ఆచార్యులు, ఒన్నెస్ క్రయోజెనిక్స్ ఫౌండర్ సీఈవో డా.రామ్ కే అలూరు, రీసెర్చ్‌శాట్ వ్యవస్థాపకుడు రవితేజ పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ తెలుగు భాషాశాస్త్రజ్ఞుల సదస్సు

ఉస్మానియా విశ్వవిద్యాలయం: ఓయూలో లింగ్విస్టిక్ విభాగంలో ఘనంగా13వ అంతర్జాతీయ తెలుగు భాషాశాస్త్రజ్ఞుల సదస్సు నిర్వహించారు. నెల్లూరులోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయనం కేంద్రం, తెలుగు భాషాశాస్త్రజ్ఞుల వేదిక సహకారంతో నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా భారతీయ భాషాశాస్త్రసంఘం మాజీ అధ్యక్షుడు ప్రొఫెసర్ జి. ఉమామహేశ్వర రావు, నెల్లూరులోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ప్రాజెక్టు డైరెక్టర్ ప్రొఫెసర్ మాడభూషి సంపత్ కుమార్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాసిం, తెలుగు భాషాశాస్త్రజ్ఞుల వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం. సి.కేశవ మూర్తి హాజరై మాట్లాడుతూ చైనా, జపాన్, మంగోలియా, జర్మనీ దేశాలలో ప్రాథమిక స్థాయి నుంచి విద్యాబోధన వారి మాతృ భాషలలోనే జరుగుతుందని చెప్పారు. ఓయూ ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ సైదా తలత్ సుల్తానా, విభాగం హెడ్ డాక్టర్ సి ఎస్ స్వాతి, కన్వీనర్ డాక్టర్ కల్లోజు సుశీల్, కోఆర్డినేటర్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలు నాయక్ పాల్గొన్నారు.

సదస్సు బ్రోచర్ ను ఆవిష్కరిస్తున్న అతిథులు

హెచ్‌సీయూ, ఫ్లిండర్స్ మధ్య కుదిరిన ఒప్పందం

కొండాపూర్, మార్చి 26 : అర్థవంతమైన విద్యా వంతెనలను నిర్మించడానికి, ప్రపంచ ఆరోగ్య సంరక్షణ, నిర్వాహణ సవాళ్లకు పరిష్కారాలను సహ సృష్టించడానికి ఇరు సంస్థల భాగస్వామ్యం ఉమ్మడి దృక్పథాన్ని ప్రదర్శిస్తుందని హైదరాబాద్ విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.జె.రావు అన్నారు. గురువారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, ఆస్ట్రేలియాలోని ఫ్లిండర్స్ యూనివర్సిటీల మధ్య ఒప్పంద కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్ నిగం, ఫ్లిండర్స్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కాలిన్ స్టిర్లింగ్‌లు ఎంఓయూలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ బి జె రావు మాట్లాడుతూ అంతర్జాతీయ విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు ప్రపంచ ఆరోగ్య సంరక్షణ, నిర్వహణలను మరింత అభివృద్ధి చేసేందుకు ఈ ఒప్పందం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణ ఆస్ట్రేలియా ఎంపీ పీటర్ మలినౌసాస్, ఆస్ట్రేలియన్ హై కమిషనర్ ఫిలిప్ గ్రీన్, బెంగళూరులోని ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ హిల్లరి మెక్లీచీ, ప్రముఖులు పాల్గొన్నారు.

ఒక వర్గానికి మేలు చేసేలా వర్గీకరణ

మాల స్టూడెంట్ జేఏసీ అధ్యక్షుడు మాదాసు రాహుల్

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో ఒక వర్గానికి మేలు చేసేలా షమీమ్ అక్తర్ కమిటీ నివేదిక ఉందని పలువురు వక్తలు ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పినట్లుగా నివేదిక పొందుపరిచారని అనుమానం వ్యక్తం చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాలలోని న్యూ సెమినార్ హాల్ లో మాల స్టూడెంట్ జేఏసీ అధ్యక్షుడు మాదాసు రాహుల్ ఆధ్వర్యంలో ''జస్టిస్ షమీమ్ అక్తర్ ఏక సభ్య కమిషన్ లో తప్పులు మరియు ఎస్సీ వర్గీకరణ జరిగిన తీరులో లోపాలు'' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ కోసం ఏర్పాటుచేసిన ఏక సభ్య కమిషన్ రిపోర్ట్ మొత్తం తప్పుల తడకగా ఉందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు మందాల భాస్కర్, మామిడి నారాయణ, సీనియర్ అడ్వకేట్ పి రత్నం, ప్రొఫెసర్లు సోడ సవీన్, మాయాదేవి, నమ్రత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు వెంకటేశ్వర్లు, ఉదయ్, తెలంగాణ మాలల ఐక్యవేదిక ప్రెసిడెంట్ వీర బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

కులాంతర వివాహం చేసుకున్న జంటలకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కులాంతర వివాహాలు అభినందనీయం: ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 26: కులాంతర వివాహాలు చేసుకోవడం అభినందనీయమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కులాంతర వివాహం చేసుకున్న మూడు జంటలు ఆర్.మధుకర్ , ఏ.లోకేష్, సాయి ప్రదీప్ లకు ఒక్కొక్కరికి రెండు లక్షల రూపాయల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లను అందించారు. కార్యక్రమంలో ఏఎస్ డబ్ల్యూ ఓ పాండు, హెచ్ డబ్ల్యూ ఓ వి. కొండలరావు, నరసింహ, పండు తదితరులు ఉన్నారు.

ధర్నాలో నినదిస్తున్న నాయకులు

కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలి

కవాడిగూడ, మార్చి 26 వ్యవసాయ మార్కెట్ సెక్యూరిటీ గార్డ్స్‌కు కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి నేరుగా కమిటీల ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీల సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్(సీఐటీయు) ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకైనా సెక్యూరిటీ గార్డుల బతుకులు బాగుపడతాయనుకుంటే ఎక్కడ వేసిన గొంగడి అక్కడనే అన్న చందంగా ఉందన్నారు. సెక్యూరిటి గార్డుల సమస్యలు పరిష్కరించాలని మంత్రులకు, అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వంగూరు రాములు, తెలంగాణ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జె.వెంకటేష్ లు పాల్గొని ధర్నాకు మద్దతు పలికారు. ఈ ధర్నా కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు తుమ్మల సాంబయ్య, ప్రధాన కార్యదర్శి యాటల సోమన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ సారికరాము, కోశాధికారి జనార్ధన్ వివిధ మార్కెట్ల సెక్యూరిటీ గార్డులు పాల్గొన్నారు.

విఆర్ఏల ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

వీఆర్ఏ వారసులకు వెంటనే ఉద్యోగాలివ్వాలి

మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

కవాడిగూడ, మార్చి 26 వీఆర్ఏ వారసులకు ప్రభుత్వం వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. కొత్తగా తీసుకువస్తున్న గ్రామ పరిపాలనా అధికారి (జిపిఓ) పోస్టుల్లో వీఆర్ఏ వారసులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జీఓ నంబర్ 81, 85 ప్రకారం 3797 మంది వీఆర్ఏల వారసులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్స్ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం ఇందిరా పార్కు వద్ద ధర్నా నిర్వహించారు.

వీఆర్ఏ జేఏసీ కన్వీనర్ వంగూరు రాములు అధ్యక్షతన జరిగిన ధర్నాలో ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పాల్గొనగా సిఐటీయూ రాష్ట్ర నాయకులు పాలడుగు భాస్కర్, ఎంఎస్ఎస్ నాయకులు చిప్పలపల్లి సోమశేఖర్, ఐటీటీయూ బాలరాజు, కేవీపీఎస్ వెంకట్రాములు హాజరై మద్దతు పలికారు. ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 20,555మంది వీఆర్ఏల్లో డిగ్రీ చదివిన వారిని జూనియర్ అసిస్టెంట్స్‌గా, ఇంటర్ చదివిన వారిని రికార్డు అసిస్టెంట్స్‌గా, పదవ తరగతి లోపు చదివిన వారిని ఆఫీస్ సబార్డినేటర్స్‌గా రెవెన్యూశాఖతో పాటు మున్సిపల్, ఇరిగేషన్, బిషన్ భగీరథ, విద్యా, వైద్య తదితర శాఖల్లో ఉన్న ఖాళీల్లో 16,758 మంది వీఆర్ఏలను ప్రభుత్వం సర్దుబాటు చేసిందన్నారు. మిగతా 3797 మంది వీఆర్ఏ వారసులకు ఉద్యోగఉత్తర్వులు ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం సరికాదన్నారు.

వ్యాఖ్యాన గ్రంథాలను ఆవిష్కరిస్తున్న వోలేటి పార్వతీశం

తాళ్ళపాక అన్నమయ్య

గొప్ప వాగ్గేయకారుడు

ప్రముఖ సాహితీవేత్త డా.వోలేటి పార్వతీశం

రవీంద్రభారతి, మార్చి 26 తెలుగు పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యులు గొప్ప వాగ్గేయకారుడని, అన్నమయ్య సంకీర్తనల సాహితీ విలువలను జనభాహుళ్యంలోనికి తీసుకు వెళ్లడానికి వెంకట్ గరికపాటి చేస్తున్న కృషి ప్రశంసనీయమని ప్రముఖ సాహితీవేత్త, ప్రసార ప్రవీణ డాక్టర్ వోలేటి పార్వతీశం అన్నారు. తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ, శ్రీరామ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో తాళ్ళపాక అన్నమాచార్యుల వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ సాహితీవేత్త డా.వోలేటి పార్వతీశం విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి అన్నమయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సభా అధ్యక్షుడు,ప్రముఖ సంగీత దర్శకుడు శ్రీ కలగా కృష్ణమోహన్ మాట్లాడుతూ అన్నమయ్యకు సాటిరాగలర, వాగ్గేయకారుడు వేరొకరు లేరని తెలిపారు. సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డా.మామిడి హరికృష్ణ మాట్లాడుతూ అన్నమయ్య సంకీర్తనల సాహిత్యంతో వెంకట్ గరికపాటి పెనవేసుకపోయారని తెలిపారు.

టూరిజం కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి

హిమాయత్ నగర్, మార్చి 26 : రాష్ట్ర వ్యాప్తంగా టూరిజం సంస్థలో గత 24 ఏండ్లుగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే కార్మికులను పర్మినెంట్ చేయాలని తెలంగాణ టూరిజం కార్పొరేషన్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 170 మంది కార్మికులు ఏండ్ల తరబడి సంస్థను నమ్ముకుని చాలీచాలని వేతనాలు పొందుతూ కాంట్రాక్టు కార్మికులుగా పని చేస్తున్నారని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు.

ప్రాజెక్టు ఉజాగర్‌తో ముస్లిం మహిళలకు ప్రోత్సాహం

సిటీబ్యూరో, మార్చి 26 (నమస్తే తెలంగాణ) ప్రాజెక్టు ఉజాగర్ ద్వారా పారిశ్రామిక శిక్షణ పొందిన 56 మంది ముస్లిం మహిళలు, యువతులకు ధృవీకరణ పత్రాలను వీ హబ్ ప్రధానం చేయనుంది. వీ హబ్ ప్రధాన కార్యాలయంలో జరిగే ఈ వేడుకల్లో ప్రీ ఇంక్యుబేషన్ లో భాగంగా వీహబ్ సేల్స్, మార్కెటింగ్, ఫైనాన్సియల్, బ్రాండింగ్, ఉత్పాదక అంశాలపై వీరికి శిక్షణ అందించింది. ప్రస్తుతం ప్రాజెక్టు ఉజాగర్‌లో శిక్షణ పూర్తి కావడంతో సర్టిఫికెట్లను అందజేయనున్నారు. మధ్యాహ్నం 12గంటలకు 56 మంది ధృవీకరణ పత్రాలు అందజేయనున్నట్లుగా వెల్లడించారు.

జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ మీట్ వాయిదా

సిటీబ్యూరో, మార్చి 26 (నమస్తే తెలంగాణ) జీహెచ్‌ఎంసీ లోకల్ బాడీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో బల్దియా ఆధ్వర్యంలో జరిగే స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేసి వచ్చే నెల 25న పోలింగ్ జరగనున్నది. ఈ మేరకు ఎన్నికల కోడ్ రావడంతో వచ్చే నెల 7 నుంచి 10వ తేదీ వరకు జీహెచ్‌ఎంసీ ఉద్యోగులు, మీడియా, కార్పొరేటర్లతో కలిసి స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. పురుషులు, మహిళల ఉద్యోగులకు వేర్వేరుగా 10 రకాల క్రీడలను నిర్వహించాలని కార్యాచరణ ప్రకటించారు. ఇంచార్జి అధికారులతో పాటుగా పర్యవేక్షణ అధికారులుగా సంబంధిత డీసీలను జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి నియమించారు. గెలుపొందిన జట్టుకు నగదు పురస్కారం అందించనున్నామని వెల్లడించారు. స్పోర్ట్స్ మీట్ రద్దు కావడంతో అందరిలోనూ నిరుత్సాహం నెలకొంది.

అభివాదనం చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, నీల వెంకటేశ్, జెల్లపల్లి అంజి

బీసీ బిల్లు చట్టం చేయాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

రవీంద్రభారతి, మార్చి27: అసెంబ్లీలో బీసీ బిల్లు పెట్టి బీసీలకు విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లు 29 శాతం నుండి 42 శాతంకు పెంచుతూ అలాగే స్థానిక సంస్థల రిజర్వేషన్లు20 శాతం నుంచి 42 శాతంకు పెంచుతూ రెండు బిల్లులు పాస్ చేయడం చారిత్రాత్మకమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అన్నారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం మాట్లాడుతూ బీసీ బిల్లు చట్టం చేయాలని, వెంటనే ఈ బిల్లులకు ప్రభుత్వం రెండు జీవోలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు నీల వెంకటేశ్, జెల్లపల్లి అంజి, నరేందర్, సూర్యనారాయణ, అనంతయ్య, రఘుపతి, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అక్షయపాత్రకు తొమ్మిది ఈవీల విరాళం

సిటీబ్యూరో : భారతదేశంలోని పిల్లల సంక్షేమాన్ని మెరుగుపరచే లక్ష్యంతో వాఘ్ బక్రీ ఫౌండేషన్ ప్రత్యేకంగా తయారు చేసిన తొమ్మిది డెలివరీ వాహనాలను అక్షయ పాత్ర ఫౌండేషన్‌కు బుధవా రం అందించింది. ఈ వాహనాల ద్వారా హైదరాబాద్, నెల్లూరు ప్రాంతాల్లో 205కు పైగా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీల్లో 10,500 మంది పిల్లలకు భోజనాన్ని సమయానికి అందించనున్నారు. అక్షయ పాత్ర రోజుకు 22.5 లక్షల మంది పిల్లలకు భోజనం అందించడానికి మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి ఈ వాహనాలు సహాయపడతాయి.

త్వరలో తెలంగాణ రాష్ట్ర ఆరెకటిక సంఘం ఎన్నికలు

సమావేశంలో పాల్గొన్న ట్రస్ట్ చైర్మన్ నర్సింగ్‌రావు, ఆరెకటిక ప్రతినిధులు

కాచిగూడ, మార్చి 26 : త్వరలో తెలంగాణ రాష్ట్ర ఆరెకటిక సంఘం ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలంగాణ ఆరెకటిక ట్రస్ట్ చైర్మన్ గౌలికార్ నర్సింగ్ రావు అన్నారు. బుధవారం కాచిగూడ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో ఆరెకటికలు దుర్భరమైన జీవితాలు గడుపుతున్నారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాల్సిన బాధ్యత ఉందని ఆయన అన్నారు. భాగ్యనగర్ బీజేపీ అధ్యక్షులుగా జమాల్ పూర్ ఆరెకటిక కులానికి చెందిన జమాల్ పూర్ చంద్రశేఖర్ ను ఎంపిక చేసి, అనంతరం యాదవ కులానికి సంబంధించిన వ్యక్తి పేరు ప్రకటించడం ఆరెకటిక కులాన్ని అవమానించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి పార్టీ అరెకటిక కులస్తుల పట్ల వ్యవహరించిన తీరు బాధాకరంగా ఉందన్నారు. త్వరలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కలిసి రాష్ట్రంలో ఆరెకటికలు ఎదుర్కొంటున్న సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరెకటిక ట్రస్ట్ ప్రతినిధులు డి. శ్రీనివాస్, ఎన్.రవికుమార్, డాక్టర్ సాహెబ్ జాదా విజయ భాస్కర్, డి.జితేందర్, జె. రమేష్.యు.యశ్వంతరావు, వి.మురళీధర్, జమాల్పూర్ సునీత,